సాక్షి సంగారెడ్డి

సోమవారం । 10 । జూలై । 2023



సైన్యంలో ఎంపికకు ఉచిత శిక్షణ

మనూరు మండలం రాయిపల్లిలో ఎస్‌బీబీ, భవిష్యభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్యంలో చేరేందుకు యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. 8లో



చెట్ల కిందే చదువులు

మొగుడంపల్లి మండలంలోని ధనాసిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదులు లేకపోవడంతో చెట్లకిందనే చదువులు సాగిస్తున్నారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఐదుగురికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించలేదని చెప్పారు.

న్యూస్‌రీల్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతను ఆదివారం బొల్లారం పారిశ్రామిక వాడలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మల్లేశ్

పటాన్‌చెరుటౌన్: ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశ్, పార్లే ఆగ్రో యూనియన్ అధ్యక్షుడు రాజయ్య అన్నారు. ఆదివారం ఇస్నాపూర్‌లో పార్లే పరిశ్రమలో వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఐటీయూ కార్మికుల పక్షాన ఎల్లవేళలా నిలుస్తుందన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని మరోసారి రుజువు అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, కిర్బి నాయకులు సుధాకర్, తలారి శ్రీనివాస్, క్రౌన్ బీర్ నాయకులు శ్రీధర్, పార్లే యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్‌లోకి వసంత్

జహీరాబాద్: రైతు సంఘం నాయకుడు, సామాజిక కార్యకర్త ఢిల్లీ వసంత్ నేడు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. పట్టణంలోని ఎన్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్న సభలో మంత్రి హరీశ్‌రావు వసంత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. శనివారం రాత్రి తన స్వగ్రామం అయిన బూచనెల్లిలో ప్రజలతో సమావేశమై చేరిక కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమం అనంతరం మంత్రి హరీశ్‌రావు మండలంలోని బూర్దిపాడ్‌లో ఆటోమొబైల్ పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి పస్తాపూర్‌లో లబ్ధిదారులకు పోడు పట్టాలు పంపిణీ చేస్తారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి'

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రజా కళాకారులు తమ స్వార్థం కోసం కాకుండా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన పీఎన్ఎం పాటల శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్లు, ఉచిత బస్ పాస్ సౌకర్యం, గుర్తింపుకార్డులు అందజేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కళాకారులకు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కోశాధికారి ఏసు, నాయకులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

సంగారెడ్డి టౌన్: కలెక్టరేట్ ఎదుట సోమవారం కల్లుగీత కార్మికులు నిర్వహిస్తున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల వృత్తిదారులకు ఇస్తామన్న రూ. లక్ష అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు, సేఫ్టీ మోకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గిజిగాడి గూడు కనువిందు







వానాకాలం మొదలవగానే గిజిగాడి గూళ్లు కనువిందు చేస్తాయి. లేలేత సన్నని కొమ్మలు, పచ్చిక బయళ్లు, తదితర వాటిని పోగుచేసి ముక్కున కరుచుకుని గూడును నిర్మిస్తాయి. పాములు సైతం పక్షి పిల్లలపై దాడి చేయకుండా.. ఏవి లోపలి వెళ్లకుండా ప్రవేశద్వారాన్ని అల్లుతాయి. జిల్లాలోని కంది మండలం చెర్లగూడెం శివారులో కనిపించిన గిజిగాడి గూళ్లు, పక్షుల సందడిని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

సబ్సిడీ పథకాలకు మంగళం



- గతంలో ఎన్ఎఫ్ఎస్ఎం, ఆర్‌కేవీవై కింద నిధులు
- మూడేళ్లుగా బడ్జెట్ కేటాయింపులు నిల్
- రైతుబంధు, బీమాతో సరిపెడుతున్న ప్రభుత్వాలు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం వ్యవసాయ శాఖలో అమలు చేస్తున్న పలు సబ్సిడీ పథకాలకు మంగళం పాడిందా అంటే అవుననే సంకేతాలు వినిపిస్తున్నాయి. కేవలం రైతుబంధు, రైతుబీమాలతోనే సరిపెట్టుకోవల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. మూడేళ్లుగా సబ్సిడీ పథకాలకు సంబంధించిన నిధులు ప్రభుత్వం మంజూరు చేయడం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ, జాతీయ ఆహార భద్రతా కమిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) తదితర పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కొంత మేర నిధులు కలిపి రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై మంజూరు చేసేవారు. ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, రొటొవేటర్లు, కల్టివేటర్లు, పశువులతో దున్నే పనిముట్లు, ప్రవర్ స్ప్రేయర్లు, చేతి పంపులు, డ్రిప్ పైపులు, టార్పాలిన్‌లు, ప్రకృతి వ్యవసాయం చేసుకునేందుకు పలు ప్రోత్సాహకాలు సబ్సిడీపై వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందించేది. కానీ మూడేళ్లుగా యాంత్రీకరణ పరికరాలకు సంబంధించిన ఎలాంటి బడ్జెట్‌నూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖకు విడుదల చేయలేదని సంబంధిత అధికారులే చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్లకు సంబంధించిన బడ్జెట్‌లో అత్యధిక శాతం మంది అధికార పార్టీ నాయకులే లబ్ధిపొందారులనే అపవాదు మూటగట్టుకొంది. శాసనసభ్యులు సూచించిన వారికే ట్రాక్టర్లు మంజూరు చేశారనే ఆరోపణలూ ఉన్నాయి. రోజు రోజుకూ మారుతున్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటున్న రైతులు వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ పథకాలకు నిధులు విడుదల చేయకపోవడం సరికాదన్న వాదన వినిపిస్తోంది. దీనికి గాను నిధులు, గైడ్‌లైన్స్ ఇప్పటి వరకు రాలేదు. తిరిగి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన అన్ని పథకాలు ప్రవేశపెట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

విత్తనాలపైనా.. కోత

ప్రతి సంవత్సరం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై కందులు, పెసర, మినుము, వేరుశనగ తదితర విత్తనాలు ప్రభుత్వం పంపిణీ చేసేది. కానీ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జనుములు, సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులకు బహుళ ప్రయోజనాలు

- గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా ఎక్కువగా ట్రాక్టర్లపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు.
- అలాగే ఇది వరకు సాగు చేసిన పంటల అవశేషాలు, తెగుళ్ల అనవాళ్లను భూమిలో లేకుండా లోతైన దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్లు ఉపయోగపడతాయి.
- నాగళ్లు, కల్టివేటర్, రోటవేటర్లతో భూమిని దున్నడంతో మట్టిగడ్డలు పగలగొట్టడం, చదును చేయడం, బోదేలు తీసేందుకు ఉపయోగపడుతుంది.
- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణ భూమిని దున్ని పంటలు వేసేందుకు ట్రాక్టర్లు ఎంతో ఉపయోగపడతాయి.

సాగుపై తీవ్ర ప్రభావం

జిల్లాలో మొత్తం భూమి 7 లక్షలా 80 వేల ఎకరాలున్నాయి. 7 లక్షలా 2 వేలా 789 ఎకరాల్లో పంట సాగు ఉన్నట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎక్కువగా రైతులు పత్తి, వరి, కంది, వివిధ రకాల పండ్ల తోటలతోపాటు తదితర పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్లుగా తిరుగుతున్నా



నాకు ఐదు ఎకరాల 20 గుంటల భూమి ఉంది. సబ్సిడీ ట్రాక్టర్ కోసం సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ప్రతి సారీ అద్దె ట్రాక్టర్లతో దుక్కి దున్ని సాగు చేయడం ఇబ్బందిగా మరుతుంది. డీజిల్ పెరిగిందని ట్రాక్టర్ల అద్దె కూడా ఎక్కువగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే ట్రాక్టర్ కోసం ఎదురుచుస్తున్నా.

– జాఫర్, పిల్లోడి

నిబంధనలు ఏమీ రాలేదు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాలకు సంబంధించిన ఎలాంటి నిధులూ విడుదల కాలేదు. దానికి సంబంధించిన నిబంధనలు కూడా ఏమీ రాలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే సబ్సిడీ పథకాలు రైతులకు తప్పకుండా అందజేస్తాం. ప్రభుత్వం నుంచి ఏం సమాధానం వస్తుందో వేచి చూస్తున్నాం.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

నేడు జిల్లాకు మంత్రి హరీశ్‌రావు రాక

- కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు నేడు జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్టు కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు పటాన్‌చెరులో ఫ్రీడమ్ పార్కు, 9:15 గంటలకు డీసీసీబీ నూతన భవనం, 9:25 గంటలకు ఆర్అండబీ గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే ఉదయం 10 గంటలకు సంగారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారని.. ఉదయం 11:30 గంటలకు జహీరాబాద్ మండలం బుర్దిపాడ్‌లో ఆటోమొబైల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జహీరాబాద్‌లో పోడు భూముల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని వివరించారు.

'పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి'

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కల్హేర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ– 2003 ద్వారా నియామకమైన టీచర్లకు న్యాయం చేయాలన్నారు. కేంద్రం మెమో ప్రకారం ఆగస్ట్ 31 తేదీ వరకు మాత్రమే గడువు ఉందని అన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకత్వం, శాసన మండలి సభ్యులు స్పందించి ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకునే విధంగా కృషి చేయాలని కోరారు.

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చడానికి కృషి

- తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పాటిల్



మాట్లాడుతున్న శుభప్రద పాటిల్

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చడానికి తనవంతుగా కృషి చేస్తున్నానని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు సుభప్రద పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని వాపోయారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌తో ఈ విషయమై ప్రతి సందర్భంలో చర్చిస్తున్నామన్నారు. ఓబీసీ ప్రక్రియ గురించి కమిషన్‌కు నివేదించామని.. రిపోర్టు ఇచ్చేలోపు కమిషన్ కాల పరిమితి ముగిసిందన్నారు. కొత్త కమిషన్‌ను మూడు సార్లు కలిశామని చెప్పారు. వీరవైశ లింగాయత్‌తో పాటు 47 కులాలను ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చి ఎన్‌సీబీసీ కమిషన్‌కు పంపించిందన్నారు. త్వరలో కమిషన్‌ను కలిసి వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని కోరుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్, కార్యదర్శి విజయ్‌కుమార్ శెట్టి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపుతాం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సేంతన్ గ్రీన్ పార్క్ హోమ్స్, ప్రణీత్ ప్రణవ్ పనోరమా కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం భవానీపురం కాలనీ చౌరస్తాలో ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన అమీన్‌పూర్ మున్సిపాలిటీని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపేట వరకు రూ. 67 కోట్లతో రహదారిని విస్తరించడంతో పాటు కాలనీల మధ్య అంతర్గత రహదారులను నిర్మించి ప్రజలకు మెరుగైన రహదారి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

బోనాల సంబురం



నారాయణఖేడ్: బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

సంగారెడ్డి మున్సిపాలిటీ/ నారాయణఖేడ్: జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఆషాఢ మాస బోనాలను ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకోగా మహిళలు ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, పద్మశాలి సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ సత్యసాయికాలనీలోని కట్ట మైసమ్మతల్లి ఆలయంలో ఆషాఢ మాస బోనాలను ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సంగారెడ్డి మున్సిపాలిటీ: బోనాల ఊరేగింపులో చింతా ప్రభాకర్, తదితరులు

క్లుప్తంగా

సాయిచంద్‌కు ఎమ్మెల్యే నివాళులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన ప్రముఖ కళాకారుడు సాయిచంద్ దశదిన కర్మకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరై సాయిచంద్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రానికి చెందిన శివ మొబైల్ యజమాని బింగి శ్రీనివాస్ తన రియల్ మీ సెల్‌ఫోన్ ఈ నెల 1న పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న ఫోన్ వివరాలు తెలుసుకొని రికవరీ అనంతరం పోగొట్టుకున్న వ్యక్తికి ఆదివారం అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ సీఏల పట్ల అసభ్య ప్రవర్తన

పీడీకి సీఏల ఫిర్యాదు, సదరు అధికారి బదిలీ

చేర్యాల(సిద్దిపేట): మహిళ సీఏల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మండల స్థాయి అధికారిని మరో మండలానికి బదిలీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామాల్లో మహిళ గ్రూపుల సభ్యులకు రుణాలు ఇప్పించడం, రుణాలు చెల్లించే వంటి విధులు నిర్వహించే సీఏలు నిత్యం మండల కార్యాలయానికి వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలోనే స్థానిక ఐకేపీ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ అధికారి కొద్ది రోజుల క్రితం ఓ మహిళ సీఏ సంతకం కోసం రాగా ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఏడుస్తూ ఆమె బయటికి వచ్చింది. విషయం తెలుసుకున్న తోటి సీఏలు వెంటనే అధికారి వద్దకు వెళ్లి నిలదీశారు. కొన్ని నెలలుగా సదరు అధికారి మండలంలోని కొందరు మహిళ సీఏలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నా పైస్థాయి అధికారి అనే ఉద్దేశ్యంతో ఓపిక పట్టారు. రోజురోజుకు అతని ప్రవర్తన హద్దుమీరడంతో సీఏలు నేరుగా జిల్లా కేంద్రానికి వెళ్లి సంబంధిత శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో స్పందించిన జిల్లా అధికారి సదరు అధికారిని పక్క మండలానికి బదిలీ చేసినట్లు సమాచారం. ఈ విషయమై పీడీ చంద్రమోహన్‌రెడ్డిని వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమేనని, పక్క మండలానికి అతనినీ బదిలీ చేశామని పేర్కొన్నారు.


వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



బన్ని (ఫైల్)

తూప్రాన్: విద్యార్థి అదృశ్యమైన ఘటన బాసర పరిధిలో చోటుచేసుకుంది. విద్యార్థి ఆచూకీ పట్ల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంఘటన తూప్రాన్ మండలంలోని నర్సంపల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..నర్సంపల్లి గ్రామానికి చెందిన కత్తుల వెంకటేష్, పద్మ రెండో కుమారుడు బన్ని(19), నిర్మల్ జిల్లా బాసరలో ఐఐఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు కుమారుడు బన్నికి ఆదివారం ఫోన్ చేశారు. దీంతో అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఈ క్రమంలోనే తన స్నేహితుడికి ఫోన్ చేయడంతో గురువారం ఇంటికి వెళ్తున్నానని తోటి స్నేహితులకు చెప్పి ఐఐఐటీ క్యాంపస్ నుంచి బయలు దేరినట్లు కుటుంబ సభ్యులకు వారు వివరించారు. నాలుగు రోజులైనా కుమారుడు ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మాత్రం బాసర తమ పరిధిలోకి రాదని అక్కడే ఫిర్యాదు చేయాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తమ కుమారుడిని అనుమతి లేకుండ పంపించడం పట్ల కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రామచంద్రాపురంలో..



నరేశ్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓవ్యక్తి అదృశ్యమైన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..తెల్లాపూర్‌లోని శ్రీసాయి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే లక్ష్మీనరేశ్ ఎలక్ట్రిషన్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వతేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే రోజు అతని భార్య దీపికకు పిల్లలు జాగ్రత్త అంటూ ఆమె ఫోన్‌కు మెసేజ్ చేశాడు. ఆందోళనకు గురైన దీపిక వెంటనే భర్తకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. వెంటనే మిత్రులు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దాంతో ఆమె ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైన్యంలోఎంపికకు ఉచిత శిక్షణ

- ఆసక్తి చూపుతున్న యువత
- 20 రోజులపాటు శిక్షణ



శిక్షణ తీసుకుంటున్న యువకులు



మనూరు(నారాయణఖేడ్): జిల్లాలోని మారుమూల ప్రాంతమైన మనూరు మండలంలోని రాయిపల్లి గ్రామంలో సైన్యంలో చేరేందుకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. మండలంలోని ఇస్లాంపూర్, తుమ్నూర్, ముగ్దంపూర్, ఉసిరికెపల్లి, ధన్వార్ గ్రామాల్లో కొన్ని సంవత్సరాలుగా ఎస్‌బీఐ మరియు భవిష్యభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాల్లోని మహిళా సంఘాలకు, విద్యార్థులకు పలు శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యతను పెంచేందుకు కృషిచేస్తున్నారు. ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. సంబంధిత స్వచ్ఛంద సంస్థలు యువత ఆర్మీ సెలక్షన్‌కు ఎంపిక అయ్యేందుకు నెల రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో మనూరు మండలంతోపాటు చుట్టు పక్కల గ్రామాల యువకులు శిక్షణలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

శిక్షణ ఉచితం..

- రాయిపల్లిలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఒక గదిని తీసుకుని శిక్షణకు ఎంపికైన వారిని అక్కడే ఉంచి రోజువారిగా శారీరక, మానసిక, పోటీ పరీక్షల్లో తట్టుకునేలా జనరల్‌నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటి, గణితం, ఇతర సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. మొదట 20మందిని ఎంపికచేసి వారికి ఉచితంగా రెండు జతల దుస్తులు, షూ, రోజువారి భోజనం ఏర్పాటు చేశారు. దీంతో యువత ఈ శిక్షణకు ఆకర్షితులవుతున్నారు.

మాజీ సైనికుడితో ప్రత్యేక శిక్షణ

- ఆర్మీ రిక్రుట్‌మెంట్‌లో ఎంపిక విధానం అనుసరించేందుకు ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికుడు బస్వరాజ్ రోజువారి శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఆర్మీ, పోలీస్ సెలక్షన్‌లో సులువుగా ఎంపిక అవ్వొచ్చని వారు పేర్కొంటున్నారు. ఎంపిక విధానంలో 17 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల లోపు ఉన్న యువతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..

- ఆర్మీలో సెలక్షన్ అయ్యేందుకు గాను ముందుగానే శిక్షణ తీసుకోవడంతో తమలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. తమ ఎంపిక సులువవుతుందని పేర్కొంటున్నారు. లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్, బాడిఫిట్‌నెస్ వంటి అంశాల్లో నైపుణ్యాలను సూచించడంతో పాటు సాధన చేయిస్తున్నారు. దీంతో ఆర్మీ సెలక్షన్‌లో తాము దాదాపుగా రాణిస్తామని భరోసాగా చెబుతున్నారు.

శిక్షణతో పాటు సలహాలు ఇస్తున్నా



ఎస్‌బీఐ మరియు భవిష్య భారత్ ఫౌండేషన్ నిర్వాహకులు చేపడుతున్న ఈ కార్యక్రమం తనను ఎంతగానో ప్రేరణ ఇచ్చింది. దీంతో తాను సైతం యువతకు శిక్షణ ఇచ్చేందుకు, వారిలో నైపుణ్యం పెంచేందుకు పలు అంశాలపై వారికి శిక్షణతోపాటు సలహాలు అందిస్తున్నాను. దీంతో ఆర్మీ, పోలీస్ వంటి రిక్రుట్‌మెంట్‌లో సులువుగా ఎంపిక అవుతారనే విశ్వాసం ఉంది. – బస్వరాజ్, రిటైర్డ్ సైనికుడు

ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చేందుకు కృషి



17సంవత్సరాలనుంచి 20సంవత్సరాల మధ్య ఉన్న యువతకు తమ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వడంతో వారు భవిష్యత్‌లో ఆర్మీ, పోలీస్ వంటి రిక్రుట్‌మెంట్ సెలక్షన్‌లో సులువుగా రాణిస్తారనే నమ్మకం ఉంది. దేశంలోనే తమ సంస్థల ఆధ్వర్యంలో మొదటిసారిగా ఇలాంటి ఉచిత శిక్షణకు శ్రీకారం చుట్టాం. చాలా మంది యువత ముందుకు వస్తున్నారు. దీంతో ఈ విషయాన్ని తమ సంస్థ పెద్దల దృష్టికి తీసుకెళ్లి ఎక్కువ మంది యువకులకు శిక్షణ ఇచ్చేందుకు కృషిచేస్తాము. కాగా స్థానికులు సైతం తమకు చాలా సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది.

–జహంగీర్, భవిష్యభారత్ స్వచ్ఛంద సంస్థ డిప్యూటీ మేనేజర్

ఘనంగా బోనాల ఊరేగింపు



బోనమెత్తుకొని బిందెపై నృత్యం చేస్తున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే ఆయా వార్డుల్లో పండుగ వాతావరణం నెలకొంది. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బోనాలకు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ హాజరై పూజలు చేశారు. 13వ వార్డులో, మల్లన్న కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన బోనాలు ఆకట్టుకున్నాయి. ఆయా వార్డుల్లో బోనాలను పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు రంగ సురేష్, నాగరాజు (నాని), మాధవి వెంకటేశం, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ ఆకుల శంకర్, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, పులుగు గోపి, అనిల్, బీజేపీ నాయకులు రాజ్యలక్ష్మి అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆందోళనతో మహిళ ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: కోర్టులో నడుస్తున్న కేసు విషయమై మానసిక ఆందోళనతో ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ పట్టణంలోని ఫతేనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ పట్టణంలోని ఫతేనగర్ వీధికి చెందిన శ్రీపతి శోభ (23) ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. శోభ మొదటి భర్త గతంలో చనిపోవడంతో ఆమెపై హవేళిఘణాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ కేసు విషయంలో కోర్టుకు తిరుగుతుంది. గత కొన్ని నెలలుగా తీవ్ర మానసిక ఆందోళన చెందుతూ శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి తల్లి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి



అక్కన్నపేట (హుస్నాబాద్): పిడుగుపాటుకు ఓ గేదె మృతి చెందింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గొర్ల సారయ్యకు సంబంధించిన గేదెను ఎప్పటిలాగే తన వ్యవసాయ క్షేత్రంలో కట్టేశాడు. తెల్లవారుజామున వెళ్లి చూసేసరికి పిడుగుపాటుకు గురై మృతి చెందింది. సుమారుగా రూ.80వేలు వరకు నష్టపోయినట్లు బోరున విలపించాడు. ఈ విషయంలో ప్రభుత్వం బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ కిరణ్, ఎస్‌ఐ మహేశ్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం సీఐ కిరణ్, ఎస్‌ఐ మహేశ్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, మల్లెచెట్టు, అంబేడ్కర్ చౌరస్తా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలు, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ కాగితాలు ఉండాలన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 15 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి వాహనదారులకు జరిమానా విధించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సీఐ కిరణ్ తెలిపారు.

ప్రత్యామ్నాయం బహుబాగు

- ఒక వైపు వ్యవసాయం, మరోవైపు జీవాల పెంపకం
- ఉపాధి పొందుతున్న రైతు
- ప్రభుత్వ ప్రోత్సాహానికి నిరీక్షణ



షెడ్డులో కుందేళ్లు

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ సాగుతోపాటు ప్రత్యామ్నాయంగా వివిధ రకాల జీవాల పెంపకంతో ఆర్థికాభివృద్ధి పొందేందుకు ఓ రైతు కృషి చేస్తున్నాడు. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన దొడ్ల నర్సింలు తనకున్న 2 ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, కూరగాయలు, వివిధ రకాల పంటలతో పాటు పలు జీవాలు పెంచుతున్నాడు. ఒకే విధమైన సాగు కాకుండా ఇతర మార్గాలు అన్వేషిస్తున్నాడు.

కుందేళ్లు, నాటుకోళ్లు, చేపల పెంపకం

వివిధ రకాల జీవాలు పెంచాలనే ఆలోచనతో సదరు రైతు సంవత్సరం క్రితం 4 కుందేళ్లను 700 ఒకటి చొప్పున కొని చిన్న షెడ్డు ఏర్పాటు చేసి పెంచుతున్నాడు. సంవత్సరం లోపు వాటి సంతానంతో వంద కుందేళ్లు అయ్యాయి. ప్రస్తుతం ఒక్కో కుందేలు 500 నుంచి 700 వరకు విక్రయిస్తున్నాడు. సంవత్సర సమయంలో కుందేళ్ల పెంపకం ద్వారా రూ.50 వేలు ఆర్జించాడు. వీటితోపాటు టర్కీ కోళ్లు, నాటు కోళ్లు, గొర్రెలు, చేపలు, పాడి గేదెలు పెంపెకం చేపడుతున్నాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో వివిధ రకాల పంటలతో పాటు జీవాలు పెంపకం చేస్తున్నాడు. మార్కెట్‌లో నాటు జీవాలకు మంచి డిమాండ్ ఉండటంతో తద్వారా ఆర్థిక లబ్ధి పొందాలనే ఉద్దేశంతో రైతు కృషి చేస్తున్నాడు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

జీవాల పెంపకం కోసం కావాల్సిన షెడ్లు లేవు. ఉన్న కొద్దిపాటి పెంపకం చేపట్టాడు. ప్రభుత్వం సబ్సిడీపై రుణం మంజూరు చేస్తే కొత్త షెడ్డుల నిర్మాణం చేపట్టి వివిధ రకాల జీవాలు అధికంగా పెంచేందుకు అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో నాటు కోళ్లు, గొర్రెలు, కుందేళ్ల మాంసానికి మంచి డిమాండ్ ఉన్నందున వాటి పెంపకానికి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించొచ్చు



పంటల సాగుతోపాటు జీవాల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధిని పొందేందుకు అవకాశాలు ఉన్నాయి. కొద్దిపాటు శ్రమించి జీవాల పెంపకం చేస్తే లాభాలు తప్పకుండా వస్తాయి. కుందేళ్లకు ఆహారంగా పచ్చిగడ్డి, వడ్లు పెడుతున్నాను. వీటి అమ్మకానికి మార్కెటింగ్ అవగాహన ఉంటే లాభలు ఆర్జించవచ్చు. వీటి పెంపకానికి ముందుకొచ్చే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహించి సబ్సిడీ రుణాలు అందజేస్తే బాగుంటుంది. – దొడ్ల నర్సింలు, రైతు, శివ్వంపేట

సాగునీటి కోసం మంత్రికి వినతి



మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో చెల్లని చెర్వు, నల్ల చెర్వుల్లోకి గోదావరి నదీ జలాలు విడుదల చేయాలని కోరుతూ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు (స్థానిక సర్పంచ్) ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీలు పిల్లి శిరీష, గురజాడ బాలాజీలు ఆదివారం మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. దుద్దెడ గ్రామంలోని రెండు చెర్వులతో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో చెర్వు శిఖం వ్యవసాయ భూములున్నాయన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. మల్లన్న సాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ల నుంచి గోదావరి నదీ జలాలు మర్పడ్గ గ్రామ చెర్వులోకి వచ్చేందుకు కాలువ నిర్మాణం పూర్తయిందన్నారు. రాంపల్లి గ్రామ పంచాయతీ నుంచి ప్రభుత్వ సర్వే నంబరు 143 లోంచి గొలుసు కట్టు కాల్వ నిర్మాణం చేస్తే దుద్దెడలోని రెండు చెర్వుల్లోకి నీరు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్న విషయాన్ని మంత్రి దృష్టికి వారు తీసుకొచ్చారు. గొలుసు కట్టు కాల్వ నిర్మాణం పూర్తి చేయించి సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలని మంత్రి హరీశ్‌రావును కోరారు. దీనికి స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిలుముల రాంమ్మోహన్, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్, రైతు బంధు జిల్లా కమిటీ సభ్యులు దోమల ఎల్లం, గ్రామ కమిటీ సభ్యులు యాదగిరి, వార్డు సభ్యులు జగపతి యాదగిరి, తూర్పు నరేష్, జక్కుల మల్లేశం, రాజయ్య, నయీ మొద్దీన్, గోనె శ్రీనివాస్, పిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దరిపల్లి శ్రీను, కుమ్మరి సంఘం నాయకులు

సిద్దిపేటకమాన్: కుమ్మరి మోడల్ ప్రాజెక్ట్‌కు రూ.2కోట్ల 20లక్షలు కేటాయించిన సందర్భంగా జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు దరిపల్లి శ్రీను ఆధ్వర్యంలో సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దరిపల్లి శ్రీను మాట్లాడుతూ 60 ఏళ్ల పాలనలో కుమ్మరి వృత్తిని ఆదుకునే చర్యలు చేపట్టలేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులవృత్తులు మళ్లీ పునరుజ్జీవం పోసుకుంటున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల 800 కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు తరిగొప్పుల రామచంద్రం, వృత్తి విభాగం అధ్యక్షుడు రవీందర్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రమణకుమార్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను, కేస్ ఫైల్స్‌ను పరిశీలించారు. ఎస్‌ఐ కాశీనాథ్‌తో కేసుల దర్యాప్తులో పురోగతిని సాధించారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలిచ్చారు. దర్యాప్తులో మరింత వేగం పెంచుకోవాలని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు, సీఐ భూపతి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రమణకుమార్

అడవి పందుల బీభత్సం

అక్కన్నపేటలో నారు మడి ధ్వంసం



అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో అడవి పందులు బీభత్సాన్ని సృష్టించాయి. స్థానికులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన (ఆచారి) రైతు నారుమడిని రాత్రి అడవి పందులు తొక్కేశాయి. ఇన్నిరోజులు కంటికి రెప్పలా కాపాడుకున్న నారు అడవిపందుల పాలైందని ఆవేదన వ్యక్తం చేశాడు. అడవిపందుల విషయంలో అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్కరకురాని 'పౌర పఠనం'

- ఆర్భాటంగా ప్రారంభించి పట్టించుకోని వైనం
- 15 రోజులు గడిచినా తాళమే



పౌర పఠన మందిరం తాళం వేసిన దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో 'పౌర పఠన మందిరం' ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి, వదిలేశారని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా జూన్ 20న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని చివరి తరగతి గది ఆర్భాటంగా ప్రారంభించడం తెలిసిందే. కానీ ప్రారంభించిన మొదటి రోజు అలా తెరిచారు మరుసటి రోజు నుంచి తాళానికే పరిమితమైంది. సుమారు 15 రోజులు కావస్తున్నా పౌర పఠన మందిరం తలుపులు మాత్రం తెర్చుకోలేదు. ఈ నేపథ్యంలో పౌర పఠన మందిరంలో నిరుద్యోగ యువత, పుస్తక ప్రియులకు విజ్ఞానాన్ని, వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువత కోసం కోరిన పుస్తకాలు తెప్పించి అందుబాటులో ఉంచాలి. పుస్తక పఠనంపై ఆసక్తి ఉన్నవారి కోసం పుస్తకాలు, వివిధ పత్రికలు అందుబాటులో ఉంచాల్సి ఉంది.

గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్న వారు అవసరమైన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లడానికి వీలుంది. నిర్ణీత గడువులోగా తీసుకున్న పుస్తకాలు తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. గ్రామాల్లోని ప్రజలు, యువతకు గ్రంథాలయాలు చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా దీనికి భిన్నంగా అక్కన్నపేటలో పౌర పఠన మందిరం తాళానికి పరిమితం కావడం విడ్డూరంగా ఉంది.

ఒకరిని కేటాయిస్తామన్నారు



మండల కేంద్రంలో పౌర పఠన మందిరం ప్రారంభించిన మరుసటి రోజు నుంచి ఒక వ్యక్తిని కేటాయిస్తామని జిల్లా గ్రంథాలయం వారు చెప్పారు. నేటీ వరకు ఎవరినీ నియమించకపోవడంతో తాళం వేశారు. తప్పనిసరిగా మినీ గ్రంథాలయం వద్ద ఒకరు ఉండాల్సి ఉంది. గ్రంథాలయం తెరిచి ఉంచాలంటే కొంతమేర డబ్బులు కేటాయించవల్సి ఉంటుంది. నేటి వరకు మాకైతే ఎలాంటి ఆదేశాలూ లేదు.

– కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీడీఓ అక్కన్నపేట

ఆకతాయి వీఆర్‌ఏకు దేహశుద్ధి

- అశ్లీల ఫొటోలు పంపి బెదిరింపు
- పథకం ప్రకారం పట్టుకొని పోలీసులకు అప్పగింత



రవితేజ

కొమురవెల్లి(సిద్దిపేట): వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయి వీఆర్‌ఏకు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలోని గురువన్నపేట శివారులో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే శ్రీగిరిపల్లి వీఆర్‌ఏ పాండవుల రవితేజ జగదేవ్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళ వీఆర్‌ఏను కొంత కాలంగా వేధిస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం ఆమె ఫోన్‌కు అశ్లీల ఫొటోలు పంపి తను చెప్పిన చోటుకు రాకుంటే నీ ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు వీఆర్‌ఏ తన స్నేహితులకు జరిగిన విషయాన్ని చెప్పింది. ఆమెకు ధైర్యం చెప్పిన స్నేహితులు పథకం ప్రకారం ఆదివారం తపాసుపల్లి రిజర్వాయర్ వద్దకు కలుద్దామని చెప్పింది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో వీఆర్‌ఏను కలుద్దామని వస్తున్న రవితేజ ఆమెకు ఫోన్ చేయగా తాను గురువన్నపేట క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నానని తెలిపింది. దీంతో రవితేజ అక్కడికి చేరుకున్నాడు. ఆమెతో మాట్లాడుతుండగా పథకం ప్రకారం అక్కడే ఉన్న మహిళ వీఆర్‌ఏ స్నేహితులు, స్థానికులు కలసి వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయి వీఆర్‌ఏ రవితేజకు దేహశుద్ధి చేసి కొమురవెల్లి పోలీసులకు అప్పగించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



చేగుంట(తూప్రాన్): మాసాయిపేట శివారులోని జాతీయ రహదారి బంగారమ్మ ఆలయ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..మాసాయిపేట శివారు 44వ జాతీయరహదారి బంగారమ్మ గుడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు ప్యాంటు మెరున్ కలర్ గీతల షర్టు ధరించి ఉన్నడన్నారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

క్లుప్తంగా

రైతులకు ఆవుల పంపిణీ



రైతులతో స్థానిక నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో ఇటీవల పిడుగుపాటుతో పాటు విద్యుదాఘాతానికి గురై ఆవులు మృతి చెందాయి. ఈ విషయాన్ని రైతులు, స్థానికులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పలువురు రైతులకు ఆదివారం 22 ఆవులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హుస్సేన్, స్థానిక నాయకులు విజయభాస్కర్ రెడ్డి, నక్క వెంకటేశ్‌గౌడ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం సీఐగా బాధ్యతలు చేపట్టిన నయీముద్దీన్‌ను ఆదివారం కౌన్సిలర్ చంద్రారెడ్డి, గోపాలమ్మ, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా నాయకులు వరప్రసాద్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ నయీముద్దీన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్ రెడ్డి అన్నారు. దోమల నివారణకు జాగ్రత్తలను తీసుకోవాలని మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు ఆమె నివాసంలోని మొక్కల కుండీలలో నిలిచిన నీటిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటి ఆవరణలో నీళ్లు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటమొలజీ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నారాయణఖేడ్: మండలం అబ్బెందలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే తనయుడు బీఆర్‌ఎస్ నాయకులు రోషన్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్‌తో కలిసి రూ.10లక్షల మంజూరుకు సంబంధించిన ప్రొసిడింగ్స్‌ను అందజేసి భూమి పనులను ప్రారంభించారు. సర్పంచ్ సుదర్శన్ రావుపాటిల్, ఎంపీటీసీ జగదేవి వెంకట్‌రెడ్డి, నాయకులు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు. పెద్ద శంకరంపేట మండలం బుజరాన్‌పల్లికి చెందిన సత్తయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసర చికిత్సల కింద సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50లక్షల మంజూరుకు సంబంధించి ఎల్వోసీని బాధితుడి కుటుంబీకులకు అందజేశారు.

చెట్లకిందే చదువులు



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- వేధిస్తున్న గదుల కొరత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- నత్తనడకన నూతన భవన నిర్మాణ పనులు
- షిఫ్టు విధానంలో తరగతులు కొనసాగించాలని తల్లిదండ్రుల వినతి



శిథిలావస్థలో పాఠశాల భవనం

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని ధనాసిరి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కిందనే చదువులను కొనసాగిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలమవడంతో కూల్చివేసి నూతన భవన నిర్మాణ పనులు చేపట్టడంతో విధిలేని పరిస్థితుల్లో ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదులను ఉపయోగించుకుంటున్నారు. రెండు పాఠశాలలను ఒకే భవనంలో కొనసాగిస్తుండటంతో ఇబ్బందికరంగా మారింది. దీంతో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను షిఫ్టు పద్ధతిలో నడపాల్సిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షం కురిస్తే అంతే..

ఉన్నత పాఠశాలలో 215 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 6నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలను కొనసాగిస్తుండగా తరగతి గదులు లేకపోవడంతో వీరంతా ప్రాథమికోన్నత పాఠశాలలోని మూడు గదులను ఉపయోగించుకుంటున్నారు. మిగతా విద్యార్థులను చెట్లకింద చదివిస్తున్నారు. వర్షం పడితే చెట్ల కింద చదువుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

తరగతి గదుల కొరత, తదితర సమస్యలపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు సానుకూలత తెలిపితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అవసరమైతే షిఫ్టు విధానంలో తరగతులు కొనసాగించేవిధంగా చూస్తాం. ప్రభుత్వానికి నివేదిక అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– ఎంఈఓ బస్వరాజ్, జహీరాబాద్

డీఈఓకు విన్నవించాం

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారికి విన్నవించాం. తరగతి గదులు సరిగా లేకపోవడంతో పాఠశాలను షిఫ్టు పద్ధతిలో కొనసాగించాలని కోరాం. అయినా ఇప్పటివరకూ సానుకూల స్పందన రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంనే స్పందించి సమస్యలు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– సర్పంచ్ హప్సిరాజ్, ధనాసిరి గ్రామం

షిఫ్ట్ విధానంలో కొనసాగించాలని వినతి

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు కూర్చునేందుకు గదులు లేకపోవడంతో కొత్త భవనం నిర్మించే వరకు షిఫ్టు విధానంలో తరగతులను కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శిథిల భవనాన్ని తొలగించాలి

ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని మధ్యాహ్న భోజన నిర్వహణకు ఉపయోగిస్తుండటంతో ఏ సమయంలో ఎం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళకు గురవుతున్నారు. దీంతో వెంటనే ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిదంబరానికి ఘన నివాళి



చిదంబరం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్, కార్పొరేటర్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: కాలుష్య నివారణకు సామాజిక ఉద్యమకారుడు చిదంబరం విశేష కృషి చేశారని జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో పార్టీలకు అతీతంగా చిదంబరం వర్ధంతి కంజ్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రుద్రారం శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిదంబరం చిత్రపటానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసుధన్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిదంబరం ఒక గొప్ప సామాజికవేత్త, ఉద్యమకారుడు, పర్యావరణవేత్త, మానవతా దృక్పథం కలిగిన మనసున్న వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, ఆంజనేయులు, మెట్టు శ్రీధర్, కొమురగూడెం శంకర్, చిదంబరం కుటుంబ సభ్యులు, జర్నలిస్టులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు పటాన్‌చెరుకు మంత్రి హరీశ్‌రావు రాక

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కార్యక్రమ ఏర్పాట్లను సీఐ లాలునాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రీడమ్ పార్క్ ప్రారంభోత్సవం, అనంతరం వార్డు కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన, డీసీసీబీ బ్యాంకు నూతన భవనంతో పాటు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ భవనాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

పోచమ్మ తల్లికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఇస్నాపూర్ గ్రామంలో ప్రముఖ్‌నగర్ కాలనీలో వైభవంగా నిర్వహించిన పోచమ్మతల్లి బోనాల మహోత్సవంలో నీలం మధు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. ఇస్నాపూర్ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, నాయకులు రఘు, గాంగరపు సతీష్ (గోపి), శ్రీనివాస్‌గౌడ్, పాండు, దశరథ్, నవీన్, మణి, రవి, రాజు, రవి, సాయి, గణేశ్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు అన్నారు. వివిధ వార్డుల మహిళలు ఆదివారం నీలం మధును కలిసి కాలనీలలోని సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు.

16న పోచమ్మ బోనాలు



ఆలయ సన్నిధిలో నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పాత రామచంద్రాపురంలో ఈ నెల 16వ తేదీన పోచమ్మ బోనాలను నిర్వహించేందుకు గ్రామపెద్దలు ఆదివారం సమావేశమై బోనాల తేదీని ప్రకటించారు. బోనాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయాల డైరెక్టర్ కుమార్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు వెన్నవరం మోహన్‌రెడ్డి, గ్రామపెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీను, జంగయ్య, నాగయ్య పాల్గొన్నారు.

భూపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు



రామచంద్రాపురంలో..

పటాన్‌చెరు: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన శాసన మండలి మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆదివారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన వెన్నవరం భూపాల్‌రెడ్డిని స్థానిక నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. నాయకులు క్రాంతి, పరమేష్, కృష్ణమూర్తి నర్సింహా పాల్గొన్నారు.

‘అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి వలసలు’



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతులబోగుడలోని ఎమ్మెల్యే నివాసంలో మాటూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చంద్రయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్, పార్టీ ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ వీరన్నపాటిల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దవులూరి వీరేశం, విజయ్, గంగన్నగారి రాజుపాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన భూపాల్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన మాజీ రాష్ట్ర శాసన మండలి ప్రొటెమ్ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు భూపాల్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు, భారతినగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలు



జహీరాబాద్: మాణిక్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో డప్పూర్‌లో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రాజ్‌కుమార్, శరణప్ప, ప్రకాష్, మాణిక్, రవిగౌడ్, మల్లప్ప, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదినం సందర్భంగా ఆయన పేరిట పూజలు చేశారు. అనంతరం ఎంపీటీసీల ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ప్రజాప్రతినిధులు జగదీశ్వర్, రజినిప్రియ సంతోష్ కుమార్ పాటిల్, విజేందర్‌రెడ్డి, రాజు, కేతకి ఆలయ చైర్మన్ వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలు పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద పాటిల్, వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర్‌రావు, శెట్టి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డిలోని 8వ, వార్డులో సీసీ రోడ్డు పనులను టీఎస్‌ఎచ్‌డీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వార్డు కౌన్సిలర్ బేగరి శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు నర్సింలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్:పట్టణంలోని ఆర్యనగర్ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన నగర సంకీర్తనకు మంచి స్పందన వచ్చింది. పురుషులతో పాటు మహిళలు,పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని భగవనామ స్మరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

బాధితులకు పరామర్శ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం చాప్టా(కే) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నర్సుగౌండ, నాగల్‌గిద్ద మండలం మోర్గికి చెందిన మాజీ ఎంపీపీ, టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది తమ తమ ఇళ్లల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకుని టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్ తదితరులు వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



జహీరాబాద్: పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్‌లో..



కల్హేర్‌లో..

జహీరాబాద్: పట్టణంలోని ఆయా కాలనీల్లో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలను ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎండి తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సదాశివపేటలో ఘనంగా బోనాల పండుగ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేంపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో మహంకాళి మందిరం వద్ద బోనాలు పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ గుర్రపు సుశీలాఅంజయ్య ఆధ్వర్యంలో భక్తులు బోనాల ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

జహీరాబాద్: పట్టణంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుధీర్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యనగర్‌లో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఆది వారం బోనాలను ఘనంగా నిర్వహించారు. గడ్డపోతారం గ్రామంలో సర్పంచ్ ప్రకాశ్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు బీజేపీ నేత అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

◆ **డివిజన్ అభివృద్ధే లక్ష్యం**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ అభివృద్ధే లక్ష్యమని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చివరి రోడ్డు, నందన్ రతన్ ప్రైడ్ కాలనీలోని రోడ్డు నంబర్ 1లో రూ.42లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ**

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కాసాల గ్రామ శివారులోని 12 వార్డులో నిర్మిస్తున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ పూసల వెంకటమ్మ సత్యనారాయణ గౌడ్ గృహం నుంచి ఒగ్గు డప్పు కళాకారులతో విగ్రహాలను ఘట్టమును ఊరేగింపుగా తచ్చి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక హోమం నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఎంపీపీ వావిలాల నర్సింలు, సర్పంచ్ రాణి రామచంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బైసాని విజయలక్ష్మి వెంకటేశం గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

◆ **కొలువుదీరిన కట్ట మైసమ్మ**

కోహీర్(జహీరాబాద్): మండలంలోని పైడిగుమ్మల్ శివారులో నూతనంగా నిర్మించిన ఆలయంలో కట్ట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నర్సింహారెడ్డి, జయసింహారెడ్డి, అశ్విన్‌రెడ్డి, జ్ఞానరత్నం, అంజయ్య, మొల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, అజయ్ రాథోడ్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా పస్క పండగ**

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కాసాల గ్రామంలో క్రైస్తవ సోదరులు పిల్లాపాపలతో గ్రామ శివారులోని పంట పొలాల మధ్యన వంట వార్పు చేసుకుని ఘనంగా పస్కా పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ జైపాల్, ఫాస్ట్ స్టేట్ కమిటీ మెంబర్లు పాముల, భాస్కర్ సాకలి సుభాష్, సంఘపెద్దలు పెండా యేసురత్నం, గూడెపు లక్ష్మణ్, శంకరయ్య, భాస్కర్, బేకరీ యాదగిరి పాల్గొన్నారు.

◆ **మఠం భిక్షపతిని కలిసిన నాయకులు**

సంగారెడ్డి మున్సిపాలిటీ: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతిని ఆదివారం జిల్లా కురుమ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు బురుగడ్డ నగేష్, ఒడీఎఫ్ ఓబీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తాడిపల్లి పాండు, నాయకులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు రూ.2.50 ఎల్‌ఓసీని అందజేశారు. గ్రామానికి చెందిన కిందికేరి చంద్రమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. దీంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజ్‌కుమార్, ప్రవీణ్ కుమార్, శబ్బీర్ అలీ పాల్గొన్నారు.